క్లుప్తంగా

మణికంఠకు పంచామృతాభిషేకాలు



పెందుర్తి: సుజాతనగర్‌లోని పూర్ణ పుష్కల సమేత ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిపారు. పూర్ణ దేవి, పుష్కల దేవి, శాస్త, అయ్యప్పస్వామికి విశేష పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం విశేషాలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు మాలధారణ చేసి మండల దీక్షలు స్వీకరించారు. ఆలయ ధర్మకర్త, గురుస్వామి వాకా చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రసాద వితరణ చేశారు.

గ్రామాల్లో 'పల్లె పండగ' నేడు

పెందుర్తి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు గురువారం పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ ప్రతినిధులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా జెర్రిపోతులపాలెం, చింతగట్ల, పెదగాడి, చింతలగ్రహారం, రాజయ్యపేట, సరిపల్లి, జంగాలపాలెం పంచాయతీలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం 4.30 గంటలకు పెందుర్తిలోని తాండ్రపాపారాయుడు కల్యాణ మండపంలో విశ్వకర్మ యోజన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు.

నేడు పినగాడిలో ఉచిత దంత వైద్య శిబిరం

పెందుర్తి: మండలంలోని పినగాడిలో అనిల్ నీరుకొండ దంత వైద్యశాల ఆధ్వర్యంలో గురువారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆస్పత్రి ప్రతినిధులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని కల్యాణ మండపంలో ఉదయం 10 గంటల నుంచి నిపుణులైన వైద్యులు దంత పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఉచితంగా క్లీనింగ్, సిమెంట్ పెట్టడంతో పాటు మందులు అందిస్తారన్నారు. తక్కువ ధరలతో అవసరమైన వారికి దంతాలు అమర్చనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సమీప గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

హత్య కేసు నిందితుడికి రిమాండ్

పెందుర్తి: జీవీఎంసీ 88వ వార్డు నరవ సమీపంలోని మన్నెపాలెం గ్రామంలో తండ్రిని కిరాతకంగా హతమార్చిన కొడుకుని పెందుర్తి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘాతుకానికి సంబంధించిన వివరాలు. కాలనీలో నివాసం ఉంటున్న యంగాలి దేముడుకి ఇద్దరు కుమారులు. వీరిలో పెద్ద కుమారుడు గోపి చెడు వ్యసనాలకు బానిస కావడంతో దేముడు తరచూ మందలించేవాడు. దీంతో ఇరువురి మధ్య చాలాసార్లు గొడవ వాతావరణం నెలకొనేది. దసరా పండగ రోజుల్లో గోపి తాగుడు మరింత ఎక్కువయింది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం మద్యం సేవించి వచ్చిన గోపిని తండ్రి దేముడు మందలించాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. దీంతో తండ్రి దేముడుని గోపి కత్తితో గొంతు కోసి హతమార్చిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై మృతుడి చిన్న కుమారుడు అచ్యుతరావు ఫిర్యాదు మేరకు గోపిని బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో పెందుర్తి పోలీస్ స్టేషన్ సమీపంలోని దొగ్గవానిపాలెంలో అదుపులోకి తీసుకున్నట్లు సీఐ సతీష్‌కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి, నిందితుడిని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని వెల్లడించారు.

పీఏసీఎస్ సభ్యుల ఈకేవైసీ గడువు 30

సబ్బవరం: శ్రీదుర్గమాంబ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో సభ్యత్వం కలిగిన వారు విధిగా ఈకేవైసీ చేయించుకోవాలని సంఘం కార్యదర్శి గొంప రమణ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ప్రస్తుతం సంఘ వివరాల కంప్యూటరీకరణ జరుగుతోందన్నారు. ఇందులో భాగంగా సభ్యులంతా సంబంధిత పత్రాలతో ఈకేవైసీ చేయించుకునేలా పలు మాధ్యమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. అయినప్పటికీ 40 శాతం సభ్యుల ఈకేవైసీ మాత్రమే జరిగిందని, మిగిలిన 60 శాతం ఈ నెల 30వ తేదీలోగా తమ వివరాలతో ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈకేవైసీ చేయించుకోని సభ్యులు పరపతి సంఘం నుంచి పలు పథకాల లబ్ధిని కోల్పోయే అవకాశం ఉందన్నారు. సభ్యులంతా వీలైనంత వేగంగా తమ పట్టాదార్ పాసు పుస్తకాలు లేదా 1బీ లేదా భూమి డాక్యుమెంట్ల నకలుతోపాటు, ఆధార్, రేషన్ కార్డు, పాన్ కార్డు, నామినీ ఆధార్, సభ్యత్వ కార్డు తదితర ధ్రువపత్రాల జిరాక్స్‌లను కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుందన్నారు.

అద్దె భవనాల్లో అంగన్‌వాడీలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నారులతో పాటు బాలింతలు, కిశోర బాలికలకు సంపూర్ణ పోషకాహారం అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశాయి. అయితే ఏళ్లు గడుస్తున్నా మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు చాలా వరకు వసతుల కొరతతో కునారిల్లుతున్నాయి. కొన్ని ప్రభుత్వ భవనాల పంచన వెళ్లదీస్తుంటే.. మరి కొన్ని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో లబ్ధిదారులకు ఆశించిన మేర అంగన్‌వాడీ సేవలు అందని పరిస్థితి.



అసంపూర్తిగా నిలిచిన బొండవానిపాలెంలోని మినీ అంగన్‌వాడీ కేంద్రం



రాయపుర అగ్రహారంలో అసంపూర్తిగా నిలిచిన అంగన్‌వాడీ కేంద్రం దుస్థితి



అద్దె భవనంలో కొనసాగుతున్న తెలుకులవానిపాలెం మినీ అంగన్‌వాడీ కేంద్రం

- నిర్మాణం మధ్యలో ఆగిన పలు అంగన్‌వాడీ భవనాలు
- సామాజిక భవనాలు, అద్దె షెడ్లలో నెట్టుకొస్తున్న వైనం

సబ్బవరం: మండలంలోని పలు అంగన్వాడీ కేంద్రాలు నిధుల కొరత, అధికారుల నిర్లిప్తతతో అరకొర వసతుల మధ్యే నెట్టుకొస్తున్నాయి. కొన్ని చోట్ల సొంత భవనాల కోసం ప్రారంభించిన నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. మరి కొన్ని చోట్ల అంగన్‌వాడీ భవనాలకు అవసరమైన స్థల సమీకరణ చేయలేక, నిర్మాణ ప్రతిపాదనలకే నోచుకోలేకపోయాయి. దీంతో ఆయా అంగన్‌వాడీ కేంద్రాలను సొంత భవనాల్లేక పరాయి పంచన నిర్వహించాల్సి వస్తోంది. కొన్నింటిని అందుబాటులో ఉన్న సామాజిక భవనాల్లో సర్దుబాటు చేయగా, మరి కొన్నింటికి అద్దె భవనాలే దిక్కయ్యాయి. అద్దె భవనాలకు యజమానులు విధించే పరిమితుల మధ్యే వాటిని నిర్వహించాల్సి వస్తోంది.

అద్దెకు తీసుకున్న భవనాల్లో నడుస్తున్నవి

సీహెచ్ అగ్రహారం, చిన్నయ్యపాలెం, జోడుగుళ్లు, పాత సబ్బవరం, గణపతిపురం, వెదుళ్లనరవ, వెదుళ్లనరవ కొత్తూరు, సున్నంబట్టీలు, దేవీపురం, గుల్లేపల్లి-2, గొంపవానిపాలెం, తెలుకులపాలెం, గొర్లివానిపాలెం, ఆర్‌పీ అగ్రహారం-2

ప్రభుత్వ భవనాల్లో సర్దుకు పోతున్న కేంద్రాలు

గొర్లివానిపాలెం, లగిశెట్టిపాలెం, బొండవానిపాలెం, సాలాపువానిపాలెం, నల్లరేగులపాలెం, నంగినారపాడు, పీతపాలెం, లంకెవానిపాలెం, ద్వారకానగర్, ఇ.మర్రిపాలెం, బుదిరెడ్లపాలెం, మొగలిపురం, ఆర్‌పీ అగ్రహారం కొత్తూరు, టి.జంగాలపాలెం.

సబ్బవరంలో అంగన్‌వాడీల వివరాలు	
మొత్తం అంగన్‌వాడీలు	87
మెయిన్ అంగన్‌వాడీలు	74
మినీ అంగన్‌వాడీలు	13
సొంత భవనాల్లో నడుస్తున్నవి	59
అద్దె భవనాల్లో నడుస్తున్నవి	14
ప్రభుత్వ భవనాల్లో నడుస్తున్నవి	14
అంగన్‌వాడీ కేంద్రాలు లేనివి	17
అసంపూర్తి నిర్మాణంలో ఉన్నవి	7
అంగన్‌వాడీలకు వెళ్తున్న చిన్నారులు	5,530 మంది
అంగన్‌వాడీ కార్యకర్తలు	86 మంది
అంగన్‌వాడీ హెల్పర్లు	84 మంది



సబ్బవరంలోని జోడుగుళ్లులో అద్దె భవనంలో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

సొంత భవనం నిర్మిస్తామన్నారు



తెలుకులపాలెం మినీ అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనంగానీ, సమీపంలో ప్రభుత్వ భవనంగానీ లేదు. దీంతో అద్దె భవనంలో కొనసాగిస్తున్నాం. సొంత భవనాలున్న చోట అన్ని రకాల వసతులు ఉంటాయి. అద్దె భవనాల్లో పరిమితులు తప్పవు. ఇక్కడ స్థల సమస్య ఉంది. ప్రస్తుతం అధికారుల ఆదేశాల మేరకు స్థల పరిశీలన జరుగుతోంది. త్వరలో సొంత భవనాన్ని నిర్మించి అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు చెప్తున్నారు.

– చిట్టిబోయిన బాల, అంగన్‌వాడీ కార్యకర్త, తెలుకులవానిపాలెం

సామాజిక భవనంలో నెట్టుకొస్తున్నాం



నిధులు చాలకపోడవంతో గ్రామంలో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం అసంపూర్తిగా నిలిచిపోయింది. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాన్ని గ్రామంలోని సామాజిక భవనంలో నిర్వహిస్తున్నాం. చాలీచాలని వసతుల మధ్యే అంగన్‌వాడీ కేంద్రాన్ని నడుపుతున్నాం. సొంత భవనం ఉన్నట్లయితే లబ్ధిదారులకు, చిన్నారులకు అనుకూలమైన వాతావరణంతో పాటు మరింత మెరుగైన సేవలను అందించేందుకు అవకాశం ఉంటుంది.

– కె.ధనలక్ష్మి, ఆర్‌పీ అగ్రహారం కొత్తూరు అంగన్‌వాడీ

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం



సరిపడా నిధుల్లేక మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్ర భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు దృష్టికి తీసుకెళ్లాం. ఎన్ఆర్‌ఈజీఎస్ నిధులతో వీటిని పూర్తి చేసేందుకు అంచనాలు రూపొందించి, ప్రతిపాదలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. స్థలం లేక భవనాలు నిర్మించలేని చోట వెంటనే పరిశీలించి, స్థలాన్ని కేటాయించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

– లలితకుమారి, సీడీపీవో, ఐసీడీఎస్ ప్రాజెక్ట్, సబ్బవరం

ముగిసిన పంచాయతీ సభ్యుల శిక్షణ తరగతులు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్

సబ్బవరం: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీల అభివృద్ధి–ప్రజల సంక్షేమం అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈ శిక్షణ తరగతులకు మండలంలోని 24 గ్రామ పంచాయతీలకు చెందిన పాలకవర్గాల్లోని ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు కలిసి 73 మంది పాల్గొన్నారు. రెండో రోజైన బుధవారం నాటి శిక్షణ తరగతులలో స్థానిక గ్రామీణ నీటి సరఫరా విభాగం(ఆర్‌డబ్ల్యూఎస్) ఏఈ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన తాగునీటి బోర్లు, వాటి వినియోగంతో పాటు రక్షిత మంచినీటి పథకాల ద్వారా అందించే నీటి సరఫరాలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తాగునీటిలో క్లోరినేషన్ చేయడం వల్ల ప్రజలకు కలిగే ఉపయోగాలను వీడియోల ద్వారా ప్రదర్శించి, వార్డు మెంబర్లకు అవగాహన కల్పించారు. తాగునీటి వనరులు కాలుష్యం బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు.

ఎంపీడీవో పద్మజ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ప్రముఖ పాత్ర వహిస్తున్న వైద్య ఆరోగ్య, తాగునీటి సరఫరా, వెటర్నరీ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులతో సభ్యులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. అధికారులు తమ విభాగాల పరిధిలో పంచాయతీలకు అవసరమైన నియమ నిబంధనలు, పంచాయతీ సభ్యుల హక్కులు, విధులను కూలంకషంగా వివరించినట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణ తరగతుల వలన గ్రామ పంచాయతీల పాలకవర్గ సభ్యులకు పంచాయతీ విధులపై మరింత అవగాహన కలిగిందన్నారు. పరిపాలనతో పాటు ప్రజా సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రజారోగ్య పరిరక్షణపై మెలకువలు తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణతో ఆయా గ్రామాల్లో జరిగే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో సభ్యుల పాత్రం కీలకంగా మారనుందన్నారు. శిక్షణ పట్ల సభ్యులు ఆనందం వ్యక్తం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ చైతన్యతో పాటు పలు గ్రామ పంచాయతీల ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి

- మండలంలో అభివృద్ధి పనులకు రూ.6.75 కోట్లు
- పలు చోట్ల శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే పంచకర్ల



తానాంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పరవాడ: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా తమ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా తొలివిడతగా మండలంలో రూ.6.75 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనుల కోసం రూ.4,500 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అర్బన్ ఏరియాలో అభివృద్ధి పనులకు రూ.12 కోట్లను మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సీసీ, బీటీ రోడ్లు, జెడ్పీ రహదారులు, ఆర్‌డబ్ల్యూఎస్ వాటర్ ట్యాంకులు, డ్రైనేజీలు, శ్మశానవాటికల్లో షెడ్లు, ప్రహరీ నిర్మాణాలకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. రెండేళ్లలో గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసే దిశగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమాల్లో పరవాడ మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, ఎంపీడీవో శ్యామ్ సుందర్, తహసీల్దార్ అంబేడ్కర్, సర్పంచ్‌లు సిరపరపు అప్పలనాయుడు, కన్నూరు దేవివెంకటరమణ, కూటమి నాయకులు వియ్యపు చిన్న, రెడ్డి శ్రీనివాసరావు, కూండ్రపు సోమునాయుడు, పైల రామచంద్రరావు, రాజాన సత్యం, చిరికి అప్పారావు, గండి ఈశ్వరరావు, వర్రి మంగలక్ష్మి వసంతరావు, వర్రి పరదేశినాయుడు, గ్రామ పెద్దలు, అధికారులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- గొల్లలపాలెం లే అవుట్ సందర్శనలో అధికారులకు విశాఖ జిల్లా కలెక్టర్ ఆదేశం



గొల్లలపాలెంలోని అర్బన్ హౌసింగ్ లే అవుట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్



అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచనలిస్తున్న కలెక్టర్

సబ్బవరం: అర్బన్ హౌసింగ్ నిర్మాణ పనుల్లో మరింత జోరు పెంచాలని, నిర్దేశిత కాలంలో పనులను పూర్తిచేసి, లబ్ధిదారులకు అందించాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ గృహ నిర్మాణ శాఖ అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా సబ్బవరం మండలంలోని గొల్లలపాలెం-2 లే అవుట్‌లో చేపట్టిన గృహ నిర్మాణాలను బుధవారం ఆయన పరిశీలించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా లే అవుట్‌లో నిర్మాణ ప్రగతిని తెలుసుకున్నారు. పనుల్ని మరింత వేగవంతం చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. రోజువారీ లక్ష్యాలకు అనుగుణంగా పనుల్ని పూర్తి చేసి, ఎప్పటికప్పుడు నివేదికను తనకు అందించాలన్నారు. తగినంత సిబ్బందిని, కార్మికులను నియమించుకుని, పనుల్లో జాప్యం లేకుండా చూసుకోవాలని కాంట్రాక్టర్లకు తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్దేశిత కాలంలో గృహ నిర్మాణాలను పూర్తిచేసి, లబ్ధిదారులకు అందించేందుకు అధికారులు కృషి చేయాలని, అందుకు కాంట్రాక్టర్లు సహకరించాలని సూచించారు. లే అవుట్లలో నిర్మాణాల తాజా పరిస్థితులను, నిర్మాణాల వివరాలను గృహ నిర్మాణ శాఖ పీడీ ఆళ్ల శ్రీనివాసరావు, స్థానిక అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

డిస్లెక్సియా అవగాహన ర్యాలీ



వాక్ ఫర్ డిస్లెక్సియాలో దివ్యాంగ విద్యార్థులు, భవిత కేంద్రం అధికారులు

పరవాడ: నిర్దిష్ట అభ్యసన వైకల్యాలున్న పిల్లలకు ప్రభుత్వం అన్ని రకాల మౌలిక సదుపాయాలను అందిస్తుందని పరవాడ మండల విద్యాశాఖాధికారి దివాకర్‌రావు అన్నారు. వాక్ ఫర్ డిస్లెక్సియా అవగాహనా మాసోత్సవాల్లో భాగంగా రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి ఆదేశాల మేరకు పరవాడ భవిత సెంటర్‌లో బుధవారం వాక్ ఫర్ డిస్లెక్సియా నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల సేవలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాఠశాల ఉపాధ్యాయిని కుమారి మాట్లాడుతూ దివ్యాంగుల చట్టం-2016 ప్రకారం 21 రకాల వైకల్యాల్లో నిర్దిష్ట అభ్యసన వైకల్యం ఒకటన్నారు. మిగిలిన దివ్యాంగుల మాదిరే వీరికి కూడా ఉపకార వేతనాలు, అలవెన్స్‌లు, పదో తరగతిలో మార్కులు మినహాయింపు వర్తిస్తుందన్నారు. అంతకు ముందు గ్రామంలో దివ్యాంగ విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భవిత సెంటర్ ఉపాధ్యాయులు జి.శ్రీనివాసరావు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దివ్యాంగుల చదువుపై మరింత శ్రద్ధ



కశింకోట భవిత కేంద్రంలో కలెక్టర్ విజయ కృష్ణన్

కశింకోట: దివ్యాంగ విద్యార్థుల చదువు పట్ల మరింత శ్రద్ధ చూపాలని కలెక్టర్ కె.విజయ కృష్ణన్ ఉపాధ్యాయులకు సూచించారు. కశింకోటలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో ఉన్న భవిత కేంద్రాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ చదువుతున్న విద్యార్థులను పేరు పేరునా పలకరించారు. ట్యాబ్‌లు వినియోగించి యాప్‌ల ద్వారా విద్యా బోధన సాగిస్తున్నారా? లేదా? అని ఆరా తీశారు. టీఎల్ఎం మెటీరియల్ వినియోగం పట్ల శ్రద్ధ తీసుకొని విద్యా బోధన చేయాలన్నారు. ఎంత మంది విద్యార్థులను ఏటా హైస్కూలుకు పంపిస్తున్నారని ప్రశ్నించగా ముగ్గురని ఉపాధ్యాయులు బదులిచ్చారు. అనంతరం అక్కడి బాలికల పాఠశాలను సందర్శించారు. గణితంలో దస్విర్‌తేజ్, ఆంగ్లంలో అదీనాలను అడిగిన ప్రశ్నలకు బాలికలు అవలీలగా బదులివ్వడంతో సంతృప్తితో ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులతోపాటు ఉపాధ్యాయుడు ఎం.శంకరరావు, హెచ్ఎం సిహెచ్.రామునాయుడును ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు. జిల్లా ఐఈ సమన్వయకర్త బి.శకుంతల, ఎంఈవో పి.వెంకట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



తలంబ్రాలను భక్తులకు చూపిస్తున్న అప్పన్న దేవస్థాన అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. స్వామివారి ఆలయ బేడా మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను పూలమాలలు, నూతన వస్త్రాలతో అందంగా అలంకరించి, వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలను శాస్త్రోక్తంగా నిర్వహించి, కల్యాణాన్ని వేడుకగా జరిపారు. కల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందించారు.

630 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత



అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యం సీజ్ చేస్తున్న డీఎస్‌వో భాస్కరరావు

పెందుర్తి: చినముషిడివాడలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని జిల్లా పౌర సరఫరాల అధికారులు బుధవారం పట్టుకున్నారు. ఇక్కడి ఓ ఇంటిలో దాదాపు 630 కిలోల రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచి విక్రయాలు జరుపుతున్నట్లు అధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు డీఎస్‌వో భాస్కరరావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి బియ్యాన్ని సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్‌వో మాట్లాడుతూ పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచి విక్రయాలు జరపడం చట్టరీత్యా నేరమన్నారు. నిందితులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

అధ్వానంగా రోడ్లు



97వ వార్డు పీఎఫ్ కాలనీ-సిద్ధార్థనగర్ రోడ్డు



సిద్ధార్థనగర్-సుజాతనగర్ రోడ్డు దుస్థితి

పెందుర్తి : జీవీఎంసీ 97వ వార్డులోని పలు కాలనీల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా చినముషిడివాడ పీఎఫ్ కాలనీ నుంచి సిద్ధార్థనగర్ రోడ్డు పూర్తిగా ఛిద్రమయింది. గోతులమయంగా మారింది. సిద్ధార్థనగర్ నుంచి సుజాతనగర్ వెళ్లే మార్గం కుంగిపోయింది. దీంతఈ రోడ్లపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఆయా రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

రోడ్లపై నీరు.. వాహనదారుల బేజారు



ఎన్టీపీసీ వద్ద రోడ్డు మీదుగా ప్రవహిస్తున్న వర్షపు నీరు

పరవాడ: వాడచీపురుపల్లి-పరవాడ రహదారిలో ఎన్టీపీసీ వద్ద రోడ్డు మీదుగా ప్రవహిస్తున్న వర్షపు నీటితో, మురుగునీరు చేరి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రెండు రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన నీరు ఎన్టీపీసీ రోడ్డును ముంచెత్తుతోంది. రోడ్డు మీదుగా ప్రవహిస్తున్న వర్షపు నీరు ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తోంది. ఇటీవల వర్షాలకు ఈ రోడ్డులో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. వాటిని పూడ్చేందుకు అధికార యంత్రాంగం చొరవ చూపలేదు. దీంతో తాజా వర్షాలకు గోతుల్లో నీరు చేరి, వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రమాదాలకు కారణమవుతున్న గోతుల్ని పూడ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

పెందుర్తి: ఒడిశా ఏజెన్సీ ప్రాంతం నుంచి నగరంలోకి కారులో గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పెందుర్తి పోలీసులు బుధవారం పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఒడిశా రాష్ట్రం కోరాపుట్‌కు చెందిన అలగు రాంబాబు, విశాఖపట్నం కంచరపాలెం సమీపంలోని ధర్మానగర్‌లో నివాసం ఉంటున్న దాకవరపు ఇమాన్యుయేల్‌తో కలిసి ఒడిశా నుంచి గంజాయిని సేకరించి కారులో నగరానికి తరలిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు సరిపల్లి వద్ద కాపుకాసి నిందితుల్ని, గంజాయిని పట్టుకున్నారు. వారిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు తెలిపారు. గతంలో రాంబాబుపై టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో, ఇమాన్యుయేల్‌పై అనకాపల్లి పోలీస్ స్టేషన్‌లో గంజాయి కేసులు ఉన్నట్లు సీఐ వెల్లడించారు.